# రవికానని...

**-ఆచంట హైమావతి**

**మా**మిడిచెట్టెక్కి కూచున్నాడు గోపాల్. చెట్టునిండా కాయలే. ఈ ఏడు బరువుతో ఒంగిపోయేలా కాసింది చెట్టు.

"నేనే దింపేస్తాను కాయలన్నీ..." ఉత్సాహంగా అరిచాడు గోపాల్.

"ఏడిశావులే! అదంత సులభం కాదు. దెబ్బ తగలకుండా కాయలు కిందకి చేర్చటాన్ని మనవాళ్ళు 'కాయలు దింపటం' అంటారు. అంటే...!" గోపాల్ మెదడుని ఉతికి ఝాడించడం మొదలు పెట్టాడు కామేశం.

జుట్టు పీక్కుని, బట్టలు చింపుకోలేదు గాని ఇంచుమించుగా అలాంటి దశకు చేరకూడదని అక్కడి నుంచి పారిపోయాడు గోపాల్.

"లేకపోతే...? అనుభవం లేని కుర్రకుంక.. తను కాయలన్నీ దింపేస్తాట్ట... దింపేయటం!" సగర్వంగా కాలరు సర్దుకుంటూ మామిడి కాయలు దింపించటానికి ఉపక్రమించాడు కామేశం.

ఈసారి కాపు చాలా బాగుంది. ప్రతీసారీ పూత ఎక్కువగా రాలిపోతుంది. మిగిలిన పూత పిందెలుగా మారినా ఆ పిందెలూ కొన్ని రాలిపోతాయి. నిలిచిన పిందెలు బాగా ఎదగకుండానే వీధిన పోయే వాళ్ళు రాళ్ళేసి కాయల్ని రాలకొట్టుకుని పట్టుకుపోతారు. అలా - అలా ఎన్ని విధాలుగానో "మైనెస్" కాగా మిగిలినవి చెట్టుగల యజమానికి దక్కుతాయి.

పచ్చిగా ఉండగా ఊరగాయలకి పనికివచ్చి, పండాక పళ్ళుగా కూడా బాగుండే తరహా చెట్టు అది. ఇవన్నీ లోలోపల తల్చుకుంటూ పనివారితో కలిసి తను కూడా పనిచేస్తున్నాడు కామేశం.

కఱ్ఱచివర కత్తికట్టటం, దానిక్కొంచెం క్రింద చిక్కం కట్టటం, దాని మూతి తెరచి ఉండేలాగ సిద్ధం చేయటం, ఆ చిక్కంలోనే కాయలు పడేలాగ కొయ్యటం, కాయకి కాయ తగలకుండా కూడా జాగ్రత్తపడడం, కాయల్ని క్రిందకి చేర్చడం... ఇదంతా చాలా నేర్పుతో కూడిన పని. నేర్పుతో బాటు ఓర్పుకూడా అవసరమే మరి!

ప్రతీసంవత్సరం మాలిచేతే కోయించేసే వారు. ఈసారి మాలి సుస్తీపడడంతో కామేశానికి ఈపని తప్పలేదు.

తల్లి "ఒరే కాముడూ నువ్వా బాధ్యత తీసుకోవాలిరా!" అంటే చొక్కా చేతులు పైకి మడిచి వస్తాదులాగ తలపంకిస్తూ ఒప్పుకున్నాడు కామేశం.

❍ ❍ ❍

"నాయనా కాముడూ! పక్షుల కోసం పది కాయలు వదలరా! వాటికి లేకుండా అన్నీ దులిపేయటం అన్యాయం కదా!" అంది తల్లి.

"గాడిది గుడ్డేం కాదూ... ఒఖ్ఖటంటే ఒ...ఖ్ఖ... కాయ కూడా చెట్టుని వదలను. ఊరగాయకి సరిపడ ఉంచి, మిగతావన్నీ సంతకి తోసేస్తాను. పక్షులూ, పందులూ అంటూ నీతులు వల్లిస్తూ కూచుంటే లాభం లేదు" దురుసుగా అన్నాడు కామేశం.

కాయలు దింపటం అయ్యాక చెట్టెక్కి మూల మూలలంతా వెతికి పాతిక - ముప్ఫై కాయలు కోసుకొచ్చాడు. అవి ఆకుల మధ్య దాక్కుని తనని ఎలా ఇబ్బంది పెట్టాయో... అయినా తను పట్టు విడవని విక్రమార్కుడిలా ఎలా పంతం పట్టి వాటిని కనుక్కు న్నాడో వర్ణించి చెప్పి అందరికీ కాలక్షేపం కలిగించాడు కామేశం.

వింటున్న గోపాల్‌కి కాముడు బాబయ్య కొట్టుకుంటున్న "డబ్బా" అవసరానికి కొంచెం ఎక్కువేమో... అన్పించింది.

మొత్తానికి అ...న్నీ కోసేశానంటావ్? అంతేనా కాముడు బాబాయ్?" అనుమానంగా మొహం పెట్టి అడిగాడు గోపాల్.

ట్రిమ్ చేసిన మీసాన్ని సర్దుకుంటూ "అందుకు సందేహమా? అన్నాడు కామేశం". పాత కథలో చిలుక లాగా?" అన్నాడు గోపాల్.

కామేశం, గోపాలుకు ప్రతీ రోజూ ఉదయం పెరటి తోటలో తిరుగుతూ తోటకి నీరు పెట్టటం అలవాటు. ముందు గోపాల్ లేచి పెరట్లోకి వచ్చాడు. మామిడి చెట్టు క్రింద సగం - సగం కొరికి పారేసిన మామిడి కాయలు రెండు కనిపించాయి. లోపల పెడదామని తీయబోయిన గోపాల్‌కి క్రితం రోజు కాముడు బాబాయి కొట్టుకున్న "స్వంత డబ్బా" గుర్తొచ్చింది.

కామేశం వచ్చేవరకూ వాటిని అలాగే ఉంచాడు. కామేశం తోటలోకి వచ్చి, కొంచెం సేపు వ్యాయామం చేసి, మామిడిచెట్టు క్రిందకి వచ్చి కాయల్ని చూశాడు.

"అరే! రెండు కాయలు రాలేయ్?! ఇవి నా కళ్ళ పడకుండా ఎలా తప్పించుకున్నాయబ్బా?" అని పైకే ఆశ్చర్యపోయాడు. గోపాల్ చూడనట్లూరుకుని లోలోపల నవ్వుకున్నాడు బాబాయ్ అవస్థకి.

తర్వాతరోజు తెల్లారేసరికి మళ్ళీ రెండుకాయలు పక్షులు తిని పారేసినవి చెట్టుక్రింద పడి ఉన్నాయి. ఆ వేళ కామేశం, గోపాల్ ఇద్దరూ ఒకేసారి కాయల్ని చూశారు.

కామేశం కాయల్ని తీస్తూ "నిన్న రెండు కాయలు ఏమూలో మిగిలితే తిన్నాయి. ఇవేళ వీటితో ఇంక ఖాళీ!" సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్లుగా అన్నాడు.

గోపాల్ నవ్వులో అతని మూతి కొంచెం హేళనగా ఒంకర తిరిగినట్లు కామేశానికి గట్టి అనుమానం.

ఆవేళ పడిన ఆ కాయలతో అన్నీ అయిపోయినట్లేనని కామేశం అనుకున్నాడు. ధైర్యంగా మాత్రం కాదు.

"గోపాల్ ముందే లేచిపోయి తోటలోకి వెడితే...? మామిడి చెట్టు - క్రింద మళ్ళీ..." అని ఎందుకో అనుమానం.

"అందుకే తనే ముందు లేచి వెళ్ళి రాలిన మామిడి కాయల్ని...." అనుకుని అంతలోనే "ఆఁ... ఇంకెక్కడి మామిడికాయలు? అన్నీ శుభ్భ...రం...గా కోసే శానుగా! ఏ...దో ఆ పక్షుల అదృష్టం బాగుండి అవి మిగిలాయి" అంటూ మనస్సుని సరిపెట్టుకున్నాడు కామేశం.

మొత్తానికి ఆ రాత్రంతా సరిగా నిద్రలేదు కామేశానికి. కొంచెం కునుకుపట్టినా పక్షులు తినిపారేసిన మామిడికాయల పోగులు కలలో కనపడి ఉలిక్కిపడి లేస్తుండడంతో కలత నిద్రే అయింది.

అలాగే నిద్రపట్టక... పట్టక తెల్లవారు ఝామున బాగా నిద్రపట్టి బాగా పొద్దెక్కాక గాని మెలకువ రాలేదు.

చివరకి కామేశం అనుకున్నంతా అయింది. అతడు లేచి మెల్లిగా బయటకు వచ్చాడు.

మూడు మామిడికాయలు పక్షులు సగం సగం తిన్నివి డైనింగ్ టేబుల్‌మీద పళ్ళెంలో పెట్టి ఉన్నాయి. వాటిని చూసి గతుక్కుమన్నాడు కామేశం. చూసీ... చూడనట్లు పెరట్లోకెళ్ళి మొహం కడుక్కుని వచ్చేసరికి కొంటెగా నవ్వుతూ మామిడికాయల పళ్ళెం దగ్గర కుర్చీలో కూర్చుని గోపాల్ కనిఫించాడు.

"ఏమిట్రా ఆబోడి నవ్వు? గజదొంగని పట్టుకున్న "బాలమేధావి" పోజూ నువ్వూను? హాఁ...య్..." ఉక్రోషంగా గోపాల్‌ని అదలించాడు కామేశం.

మరిది అవస్థ గమనించిన గోపాల్ తల్లి "వాడొక చిలిపి వెధవ. వాడితో నీకేమిటి కామేశం? అయినా అన్నీ మనమే తినాలని కోసేస్తామాఁ ఏమిటి? కొన్నింటిని పక్షులకి వదలటం మన ఆనవాయితే కదా!" అంటూ సమర్థించింది.

"ఔను గదా!" అన్నాడు గొణుగుతూ కామేశం. కాయలు దింపేముందు తనకీ - తల్లికీ జరిగిన సంభాషణ గుర్తొచ్చిందతనికి.

"నేను మాత్రం ఏమన్నానని? మనమే అన్నీ తెలిసిన వాళ్ళం - అనుకుంటాం గాని... మనకంటే నిశితంగా గమనిస్తాయి పక్షులు. ఎంత ఆకుల గుబురుల్లో ఉన్న వాట్లని కూడా చక్కగా గమనించగలవు తెలుసా?" అన్నాడు గోపాల్.

గోపాల్ మాటలను సమర్థిస్తున్నట్లు ప్రోత్సాహకరంగా సైగ చేసింది గోపాల్ బామ్మ. ఆవిడగారి భర్త గోపాలయ్యగారి పేరే గోపాల్‌ది కూడా! అందుకే మనవడికి తన భర్త తెలివితేటలే వచ్చాయని, సాక్షాత్తూ తన భర్తే తనకి మనమడై పుట్టాడనీ గట్టి నమ్మకం ఆమెకు. గోపాల్ మీద ఈగను కూడా వాలనివ్వదామె.

బామ్మ సపోర్ట్‌తో మరో అడుగు ముందుకేసి విజృంభించేశాడు గోపాల్. బాబాయికి పాఠం చెప్పే అవకాశం దొరికినందుకు బోలెడు ఆనందంగా ఉందతనికి.

"ఒక్కొక్కసారి అలా మనుషులకు గర్వభంగం కలిగిస్తాయి ఆ పక్షులు. పాపం! బాబాయి కళ్ళకంటే వాటికళ్ళే బాగా చురుకైనవని నిరూపించాయవి" బాబాయిని చూసి నవ్వుతూ అన్నాడు.

"పూరం కృష్ణదేవరాయలు సందర్భానుసారం కవులకిచ్చిన సమస్య" రవి కాననిచో కవిగాంచును కదా!" అన్నట్లుగా బాబాయికి కనిపించని కాయలు పక్షులకు కనిపించాయిగదా!....

అలాగే... "కాముడు గాననిచో కాకులు గాంచును గదా!" అని... సరిగ్గా పోల్చాను గదా!?" కళ్ళు మిటకరిస్తూ అన్నాడు గోపాల్.

అక్కడి పరిస్థితిని గోపీ తండ్రి గ్రహించాడు. తన తమ్ముడు చిన్నబుచ్చుకునే స్థితి నుంచి తప్పించాలనీ, గోపీని అదుపు చెయ్యాలని "నా చేతి బెత్తం నీ వీపుని ముద్దాడవలెనని ఆత్రుత పడుచున్నది గదా!" అన్నాడు బెత్తం అందుకుంటూ.

గోపాల్ వెళ్ళి బామ్మ వెనకాల దాక్కున్నాడు. కామేశం గోపాల్ చిలిపి చేష్టలకి నవ్వుకున్నాడు.

"మన గోపాల్ చెప్పిన విషయం ఒప్పుకో తగ్గదే అన్నయ్యా! రకరకాల పుస్తకాలు చదువుతూ ఉంటాడు గదా! చాలా విషయాల్లో వాడి నాలెడ్జి బాగుంది. నేను నిజంగానే అన్నీ కోసేశానని అనుకున్నాను. కాని? మూడు రోజులూ చెట్టు క్రింద మామిడి కాయలు చూసిన తర్వాత గాని పక్షుల చూపు అంత పదునుగా ఉంటుందని గ్రహించలేకపోయాను.

ఈ విషయం ఇప్పటికీ నాకు ఆశ్చర్యాన్నే కలిగిస్తోంది. మొట్టమొదటిసారిగా తన ఓటమిని మనస్ఫూర్తిగా అంగీకరించాడు కామేశం. నవ్వుతూ గోపీ చేతిని తన చేతిలోకి తీసుకుని మెచ్చుకోలుగా కదిలించాడు.

"పక్షులు తెలివితేటల్ని నిరూపించాలనేగాని నిన్ను ఎదిరించాలని కాదు బాబాయ్!" తలొంచుకుని నమ్రతగా అన్నాడు గోపాల్.

"ఐ ఎగ్రీ మై డియర్ బోయ్!" అన్నాడు కామేశం గోపాల్ వెన్ను తడుతూ.

"థాంక్స్ బాబాయ్" అన్నాడు గోపాల్ మెరిసే కళ్ళతో. ■

*Edited, Printed and published by* Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033.
*Printed at* Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004. Chief Editor: I.Venkat Rao